ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -72 పేజీలు - 04 వెల - 04/- శనివారం 21 డిసెంబర్ 2024



ఉమ్మడి కృష్ణా జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

గంగూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ఎప్పుడు ఏ పంట వేస్తే లాభం వస్తుందో రైతులకు వివరిస్తామన్న చంద్రబాబు

# ఖర్చు తగ్గించాలి ఆదాయం పెంచాలి



ఆంధ్ర ప్రగతి కృష్ణా /అమరావతి డిసెంబర్ 20: ఏపీ సీఎం చంద్రబాబు పలువురు మంత్రులతో కలిసి ఉమ్మడి కృష్ణా జిల్లాలో పర్యటించారు. గంగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. రైతుల ఖర్చు తగ్గించాలి, ఆదాయం పెంచాలి అనేదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏ సీజన్ లో, ఎలాంటి పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో రైతులకు వివరిస్తామని అన్నారు. ముఖ్యంగా, పంట చేతికొచ్చాక మార్కెటింగ్ ఎలా చేసుకోవాలో రైతులకు అవగాహన కలిగిస్తామని చెప్పారు. మిగతాది 2లో...

# బడ్జెట్ పై కేంద్రం కసరత్తు...

రాజస్థాన్ లో కీలక సమావేశానికి పయ్యావుల హాజరు

2025-26 సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పన

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన సమావేశం

ఏపీకి కావాల్సిన నిధులపై పయ్యావుల విజ్ఞప్తి




ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ డిసెంబర్ 20:నూతన సంవత్సరం వస్తుండడంతో వార్షిక బడ్జెట్ పై కేంద్రం కసరత్తులు షురూ చేసింది. 2025-26 సంవత్సరానికి గాను కేంద్ర బడ్జెట్ రూపకల్పన కోసం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నేడు రాజస్థాన్ లో కీలక సమావేశం నిర్వహించారు. కేంద్రం కసరత్తులో భాగంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో నిర్మలా సీతారామన్ సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ క్రమంలో, రాజస్థాన్ లో జరిగిన సమావేశానికి ఏపీ ఆరి?క మంత్రి పయ్యావుల కేశవ్ కూడా హాజరయ్యారు. రాష్ట్ర ఆర్థిక అవసరాలు, ప్రాధాన్యతా రంగాలకు అవసరమైన నిధులు అంశంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కు పయ్యావుల వివరించారు. నదుల అనుసంధానం, పూర్వోదయా వంటి స్కీమ్ ల కేటాయింపుల్లో ఏపీకి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. "ఏపీలో రెండు వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతోంది. మిగతాది 2లో...



# గిరిజన గ్రామాలకు మహర్దశ

డోలీ బాధల నుంచి విముక్తి

పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం

రూ.36.71 కోట్లతో, 39.32 కి.మీ. మేర రోడ్లు

శంకుస్థాపన చేసిన డిప్యూటి సిఎం పవన్

గిరిజన ప్రాంతాల్లో పర్యటించి సమస్యలపై చర్చ



పార్వతీపురం,ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 20: గిరిజన ప్రాంతాలకు మహర్దశ దక్కింది. తరచూ డోలీలో ప్రయాణించే ప్రమాదం నుంచి బయటపడనున్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలని తిరుపతి కొండ ఎక్కినప్పుడు మొక్కుకున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ బాగుజోల గ్రామంలో ఆయన పర్యటించారు. గిరిజన ప్రాంతాల్లో స్వయంగా పర్యటించిన పవన్.. ప్రధాన మార్గం నుంచి బాగుజోల గ్రామానికి నడిచి వెళ్లారు.. గిరిజనుల కష్టాలను స్వయంగా చూసి తెలుసుకున్నారు. మిగతాది 2లో...

వైయస్ఆర్ కాంగ్రెస్ 2లో

## వైసీపీకి రాజీనామా చేసిన విశాఖ డెయిరీ చైర్మన్, 12 మంది డైరెక్టర్లు

వైసీపీని వరుసగా వీడుతున్న నేతలు

విశాఖ డెయిరీ చైర్మన్ అడారి ఆనంద్ కుమార్ రాజీనామా

వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేస్తున్నా ఆనంద్ కుమార్

# ప్రపంచస్థాయి ప్రమాణాలతో యువతకు శిక్షణే లక్ష్యం

మంత్రి నారా లోకేశ్ సమక్షంలో మరో రెండు కీలక ఒప్పందాలు...

ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయనున్న ఫిజిక్స్ వాలా, టీబీఐ

మంత్రి నారా లోకేశ్ నివాసంలో ఒప్పందాలపై సంతకాలు





# పార్లమెంట్‌లో మళ్లీ అదే రచ్చ..

## లోక్‌సభ నిరవధిక వాయిదా

ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ డిసెంబర్ 20:పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు చివరి రోజైన శుక్రవారం కూడా ఉభయ సభల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేస్తూ రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ నిర్ణయం తీసుకున్నారు. సభా నాయకులు, విపక్ష నేతలు తన ఛాంబర్‌కు వచ్చి కలవాలని ఆయన కోరారు.మరోవైపు, లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. విపక్ష ఎంపీల నినాదాలపై స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. పార్లమెంటు గౌరవాన్ని, సభలో శాంతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క సభ్యుడిపైనా ఉందని పునరుద్ఘాటించారు. జాతీయగీతాలాపన పూర్తయిన వెంటనే సభను వాయిదా వేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. శీతాకాల సమావేశాలకు ముగింపు సూచకంగా వాయిదా వేశారు. దీంతో దిగువ సభ నిరవధిక వాయిదా పడింది. కాగా, వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) పంపించేందుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# చట్టాలున్నది మొగుళ్లను బెదిరించడానికి కాదు..!

-సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు.



-మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటోన్న పుణే దంపతులు.

-విడాకులు మంజూరు చేసిన కుటుంబ న్యాయస్థానం.

-భరణం కింద రూ.500 కోట్లు డిమాండ్ చేసిన భార్య.

2లో

# ఖర్చు తగ్గించాలి, ఆదాయం పెంచాలి

## : గంగూరులో సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)
ధాన్యానికి సంబంధించి తేమ శాతం, ఇతరత్రా అంశాల్లో కచ్చితత్వం ఉండడం అవసరమని చంద్రబాబు స్పష్టం చేశారు. గోనె సంచుల పంపిణీలో రైస్ మిల్లులు పొరపాట్లు చేస్తున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, 5 కోట్ల గోనె సంచులు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీల్లో డ్రైయర్లు ఏర్పాటు చేశామని, తేమ ఎక్కువగా ఉన్న చోట్ల డ్రైయర్లు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. 1,713 రైస్ మిల్లులకు గాను 394 మిల్లుల్లో మాత్రమే డ్రైయర్లు ఉన్నాయని వివరించారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు రైతుకు అవకాశం ఉండాలని భావిస్తున్నామని తెలిపారు. హార్వెస్టర్ యంత్రాలు వచ్చాక రైతులు సంతోషంగా ఉన్నారని, ఎక్కువ దిగుబడికి కారణాలేంటి అనే అంశాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇటీవల డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ ఎక్కువవుతోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు.గతేడాది కంటే ఈ ఏడాది, ఈ సమయానికి 40 శాతం ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు జరిగాయని చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే 3.20 లక్షల మంది రైతుల నుంచి 21.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 48 గంటల కంటే ముందే ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు.

# పెండింగ్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి.!

**-పోలీస్, న్యాయశాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి.**

**-ఫాస్ట్ ట్రాక్, ప్రత్యేక కోర్టులపై న్యాయ, హెూం మంత్రుల సమీక్ష.**



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 20:
రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న వివిధ రకాల కోర్టు కేసుల పరిష్కారంపై న్యాయశాఖ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర న్యాయ, మైనారిటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరు పై ముఖ్య అధికారులతో మంత్రులు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రులు ఫరూక్, అనిత మాట్లాడారు. కేసుల తీవ్రతను బట్టి, ఏ ఉద్దేశ్యంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టులు పనిచేస్తున్నాయో అందుకు అనుగుణంగా ఆయా కోర్టుల్లోని కేసులు ఎక్కువ కాలం కొనసాగకుండా వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేటట్లుగా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.అవసరమైతే రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశానుసారం సమన్వయం తో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా సంచలన కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయ పరిష్కారానికి టాస్క్ ఫోర్స్ కోర్టు, ప్రత్యేక కోర్టులు మరింత వేగంగా పనిచేయాలని సూచించడం జరిగింది. సమీక్ష సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి జి ప్రతిభా దేవి, హెూం శాఖ కార్యదర్శి తదితర ముఖ్యమైన అధికార బృందం పాల్గొన్నారు.

# బడ్జెట్ పై కేంద్రం కసరత్తు...

(మొదటి పేజీ తరువాయి)
నీటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి ఏపీ సీయం చంద్రబాబు పట్టిసీమ ద్వారా కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం చేపట్టారు. ఇప్పుడు కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం చేయాల్సి ఉంది. నదుల అనుసంధానం ద్వారా రాయలసీమ ప్రాంతానికి నీరు అందుతుంది. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లా రాయలసీమలోనే ఉంది. జైసల్మేర్ కంటే అనంతపురంలో తక్కువ వర్షపాతం నమోదవుతుంది. కేంద్రం కూడా నదుల అనుసంధానం పైన దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ఏపీలో నదుల అనుసంధానికి నిధులు కేటాయించాలి. పూర్వోదయా స్కీంలో భాగంగా ఈఏపీ ప్రాజెక్టుల ద్వారా ఏపీకి రాయితీలు అందివ్వాలి. మౌలిక సదుపాయాలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, మెట్రో రైలు వంటి ప్రాజెక్టులకు నిధులను ఈఏపీ ప్రాజెక్టులతో అనుసంధానించాలి. 90:10 పద్దతిన పూర్వోదయా స్కీం నిధులను అందివ్వాలి.గ్రీన్ ఫీల్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీ, ఏవియేషన్ యూనివర్సిటీ, సంప్రదాయేతర ఇంధన వనరులపై ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటుకు రూ. 100 కోట్లు ఇవ్వాలి. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు విభజన చట్టం మేరకు ఆర్థిక సాయం అందివ్వాలి. ఏపీలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారు. ఐదు టెక్స్ టైల్ క్లస్టర్ల ఏర్పాటుకు నిధులివ్వాలి" అని పయ్యావుల కేశవ్ ఈ సమావేశంలో నిర్మలా సీతారామన్ కు విజ్ఞప్తి చేశారు.

# 4లక్షలకుపైగా బ్యాక్‌లాగ్ రిజర్వ్‌డ్ ఉద్యోగాలు భర్తీ

## కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ, ,డిసెంబర్20 ఆంధ్ర ప్రగతి: షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ), ఇతర వెనకబడిన ఓబీసీ అభ్యర్థులకు 2016 నుంచి దాదాపు 4 లక్షలకుపైగా బ్యాక్‌లాగ్ రిజర్వ్‌డ్ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం (డిసెంబర్ 19) తెలిపారు. ఈ మేరకు ఆయా మంత్రిత్వ శాఖలు, విభాగాలు అందించిన డేటా ప్రకారం వెల్లడించినట్లు ఆయన తెలిపారు. రిజర్వ్‌డ్ కేటగిరీలో బ్యాక్‌లాగ్ ఖాళీలతో సహా ఉద్యోగ ఖాళీలు ఏర్పడటం, వాటిని వెనువెంటనే భర్తీ చేయడం.. ఇది నిరంతర ప్రక్రియని మంత్రి జితేంద్ర రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. బ్యాక్‌లాగ్ రిజర్వ్‌డ్ ఖాళీలు ఏర్పడటానికి గల మూలకారణాన్ని అధ్యయనం చేయడానికి, ఖాళీలకు కారణమయ్యే కారకాలను తొలగించడానికి, వాటిని భర్తీ చేయడానికి ఓ అంతర్గత కమిటీని ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలకు ఆదేశాలు ఇప్పటికే జారీ చేసినట్లు మంత్రి సింగ్ అన్నారు. అలాగే ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లను కూడా ఎప్పటికప్పుడు నిర్వహించేలా అదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్‌కు సంబంధించిన ఉత్తర్వులు, సూచనలను సక్రమంగా పాటించేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వంలోని ప్రతి మంత్రిత్వ శాఖ, ప్రతి విభాగంలో డిప్యూటీ సెక్రటరీ, అంతకు పైస్థాయి అధికారిని లైజన్ ఆఫీసర్‌గా నియమించాలని మంత్రి అన్నారు. ప్రతి మంత్రిత్వ శాఖ విధుల నిర్వహణలో ఉద్యోగులకు సహాయం చేయడానికి లైజన్ ఆఫీసర్ ప్రత్యక్ష నియంత్రణలో ప్రత్యేక రిజర్వేషన్ సెల్‌ను సైతం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వంలోని ఖాళీల వివరాలను సంబంధిత మంత్రిత్వ శాఖల పరిధిలోని సంబంధిత ప్రభుత్వ సంస్థలు మాత్రమే నిర్వహిస్తాయని, వీటిల్లో ఖాళీగా ఉన్న పోస్టులను సకాలంలో భర్తీ చేసేలా ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరించారు. ఈ మేరకు రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వక సమాధానం అందించారు.

# ప్రపంచస్థాయి ప్రమాణాలతో యువతకు శిక్షణే లక్ష్యం

## మంత్రి నారా లోకేశ్ సమక్షంలో మరో రెండు కీలక ఒప్పందాలు...

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 20:
అధునాతన సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగేందుకు అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ లో డీప్-టెక్ ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఈ రెండు ఒప్పందాలు జరిగాయి.ఫిజిక్స్ వాలా ఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ లో ఫోకస్డ్ ఫస్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్ ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. మరోవైపు, రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ తో ఏపీ ప్రభుత్వం మరో ఒప్పందం చేసుకుంది. ఉండవల్లి నివాసంలో నారా లోకేశ్ సమక్షంలో ఫిజిక్స్ వాలా, టోనీబ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వేర్వేరుగా ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్స్ ను ఏకీకృతం చేసే దిశగా పని చేస్తుంది. పరిశోధన, విద్య, ఉపాధిలో కీలక సవాళ్లను పరిష్కరించడంపై దృష్టిసారిస్తుంది. హబ్-అండ్-స్పోక్ మోడల్‌ను అనుసరించి ఇన్నోవేషన్ యూనివర్సిటీ సెంట్రల్ హబ్‌గా పనిచేస్తుంది. దీని ద్వారా విభిన్న నేపథ్యాలు, ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు సమకాలీన, హైబ్రిడ్ విద్య అందుబాటులోకి వస్తుంది. ఆన్‌లైన్, వ్యక్తిగత అభ్యసన అనుభవాలను ఇంటిగ్రేట్ చేస్తారు.
ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... కృత్రిమ మేధ (ఏఐ)లో ఏపీ యువతను నెం.1గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా ఈ ఒప్పందాలు జరిగాయని అన్నారు. అధునాతన ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడం, అందుకు ఏపీ యువతను సన్నద్ధం చేయడమే తమ లక్ష్యమన్నారు. పరిశ్రమల డిమాండ్, ప్రమాణాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్ మెంట్ పై యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ దృష్టిసారిస్తుందని చెప్పారు. అధునాతన సాంకేతికత, విద్యను ఏకీకృతం చేయడానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ కృషి చేస్తుందని చెప్పారు. ఏఐలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక, నెక్స్ట్ జనరేషన్ నైపుణ్యాలకు మార్గం సుగమం చేస్తున్నామని మంత్రి లోకేష్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్నత విద్య వ్యవస్థను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం పై సంతకం చేసింది. ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఏపీ విద్యార్థులను తీర్చిదిద్దడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయంగా విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏపీ ఉన్నత విద్యలో చేయాల్సిన మార్పులపై ప్రభుత్వానికి సలహా ఇస్తుంది. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించే విద్యా విధానాలను గుర్తిస్తుంది. విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో తృతీయ విద్య ల్యాండ్ స్కేప్ ను మెరుగుపర్చడానికి కృషిచేస్తుంది. ఏపీలో సమగ్ర, స్థిరమైన ఆర్థికవృద్ధి వేదిక ఏర్పాటుకు అవసరమైన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ప్రస్తుత వ్యవస్థలో నైపుణ్య అంతరాలను గుర్తించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ విధానాలను అమలుచేసేందుకు ఏపీ ప్రభుత్వంతో టీబీఐ కలసి పనిచేస్తుంది. ఇందుకు అవసరమైన సమగ్ర రోడ్ మ్యాప్ ను అభివృద్ధి చేయడంలో సహకరిస్తుంది.

# గిరిజన గ్రామాలకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)
. గిరిజనులకు డోలీ మోతలు తప్పేలా కొత్త రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం నూతన రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో సుమారు రూ.36.71 కోట్ల వ్యయంతో, 39.32 కి.మీ. మేర నూతన రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు.. తద్వారా 55 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. 2017 పోరాట యాత్ర సమయంలో గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు కొన్ని సమస్యలు చూశానని పవన్ తెలిపారు. తాగునీరు, రహదారులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టారు గానీ.. ఇక్కడ రోడ్లు మాత్రం వేయలేకపోయారని వైకాపా పాలనను విమర్శించారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పవన్ అన్నారు. కూటమి ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా గిరిజన ప్రాంతాల్లో రహదారులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సుందరమైన జలపాతాలు ఉన్న ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన అభిమానులకు స్వీట్ వార్నింగ్ ఇచ్చారు..అయితే, ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతుండగా.. ఓజీ.. ఓజీ.. అంటూ ఆయన అభిమానులు నినాదాలు చేశారు.. వెంటనే వారికి స్వీట్ వార్నింగ్ ఇచ్చిన ఆయన.. ఓజీ.. ఓజీ.. అని అరవకండి.. నన్ను పని చేసుకోనివ్వండి అని సూచించారు.. నేను డిప్యూటీ సీఎంను అయినా.. ఇంకా సీఎం సీఎం అని అరుస్తున్నారు.. ఇది సరైంది కాదని హితవు చెప్పారు.. ఇక, తిరుబాటును, భాషను నేర్పించిన నేల ఇది.. మీరు సినిమాల మోజులో పడి? హీరోలకు జేజేలు కొట్టడం కాదు.. మీ జీవితాల మీద దృష్టి పెట్టండి అని సూచించారు.. ఇక, మాట్లాడితే అన్నా మీసం తిప్పు.. మీసం తిప్పు అంటారు.. నేను మీసం తెప్పితే రోడ్ల పడవు చాతీ మీద కొట్టుకుంటే రోడ్లు పడవు.. నేను ప్రధాని, ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లి చెబితే రోడ్లు పడతాయి.. అందుకే నన్ను పని చేయనివ్వండి అంటూ విజ్ఞప్తి చేశారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. 2019లో నన్ను గెలిపించలేదు? పరీక్షించారు నిలబడతాడో లేదో అని.. అది మంచిదే అన్నారు.. రోడ్ల నిర్మాణంలో క్వాలిటీ ఉందో మీరు చెక్ చేస్తూ ఉండాలి.. గొడవ పెట్టుకోండి అని సూచించారు.. డోలిలో గర్భిణీలు చనిపోతే నా చెల్లి, అక్క చనిపోయినంత బాధపడే వాడిని అంటూ గుర్తుచేసుకున్నారు పవన్ కల్యాణ్..

# వైసీపీకి రాజీనామా చేసిన విశాఖ డెయిరీ చైర్మన్, 12 మంది డైరెక్టర్లు

**వైసీపీని వరుసగా వీడుతున్న నేతలు**

**విశాఖ డెయిరీ చైర్మన్ అడారి ఆనంద్ కుమార్ రాజీనామా**

**వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేస్తున్నాన్న ఆనంద్ కుమార్**

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 20:
అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ప్రతి రోజు ఎవరో ఒకరు పార్టీకి గుడ్ బై చెపుతున్నారు. ఇప్పటికే ఎంతోమంది ప్రజాప్రతినిధులు వైసీపీని వీడారు. తాజాగా ఆ పార్టీకి మరో షాక్ తగిలింది. విశాఖ డెయిరీ ఛైర్మన్ అడారి ఆనంద్ కుమార్ వైసీపీకి వీడ్కోలు పలికారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఆనంద్ పేర్కొన్నారు.ఆనంద్ తో పాటు 12 మంది డెయిరీ డైరెక్టర్లు కూడా వైసీపీకి రాజీనామా చేశారు. వీరిలో వరాహ వెంకట శంకర్రావు, పిల్లా రమా కుమారి, కోళ్ల కాటమయ్య, శీరంరెడ్డి సూర్యనారాయణ, ఆరంగి రమణబాబు, రెడ్డి రామకృష్ణ, దాడి పవన్ కుమార్, పరదేశి గంగాధర్, సుందరపు ఈశ్వర్, చిటికెల రాజకుమారి తదితరులు ఉన్నారు. వీరంతా తమ రాజీనామా లేఖలను వైసీపీ కేంద్ర కార్యాలయానికి పంపించారు.



# చట్టాలున్నది మొగుళ్లను బెదిరించడానికి కాదు..!

## -సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

**-మనస్పర్ధలతో వేర్వేరుగా ఉంటోన్న పుణే దంపతులు.**

**-విడాకులు మంజూరు చేసిన కుటుంబ న్యాయస్థానం.**

**-భరణం కింద రూ.500 కోట్లు డిమాండ్ చేసిన భార్య.**



ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ డిసెంబర్ 20:
ప్రభుత్వాలు అమల్లోకి తెచ్చిన కఠిన చట్టాలు మహిళల సంక్షేమం కోసమే కానీ.. భర్తలను శిక్షించడం, బెదిరించడం, దోపిడీ చేయడానికి కాదని సర్వోన్నత న్యాయస్థానం మండిపడింది.
వివాహ వ్యవస్థను హిందువులు ఎంతో పవిత్రమైనదిగా, కుటుంబానికి బలమైన పునాదిగా భావిస్తారని, అది వ్యాపార సాధనం కాదని స్పష్టం చేసింది. భార్యను చిత్రహింసలకు గురిచేశారని, వేధింపులకు పాల్పడుతున్నారని, అత్యాచారాలు జరిపారన్న ఆరోపణలను గంపగుత్తగా పేర్చి.. చట్టాల్లోని పలు సెక్షన్ల కింద భర్త, అతడి కుటుంబంపై కేసులు పెడుతున్నారని వ్యాఖ్యానించింది. ఈ మేరకు మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఓ దంపతుల విడాకుల కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం గురువారం ఈ వ్యాఖ్యలు చేసింది. తీవ్ర మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటోన్న దంపతుల వైవాహిక బంధాన్ని రద్దు చేసిన ధర్మాసనం.. భార్యకు శాశ్వత భరణం కింద రూ.12 కోట్లను నెల రోజుల్లోగా చెల్లించాలని సదరు భర్తను ఆదేశించింది. ఇదే సమయంలో అతడిపై ఉన్న క్రిమినల్ కేసులను కొట్టివేసింది. భార్య తరఫున బేరసారాలు సాగించడానికి భర్త, ఆయన కుటుంబం తీవ్రమైన ఆరోపణలు చేయటం ప్రస్తుతం ఫ్యాషన్‌గా మారిందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ డిమాండ్లలో ఎక్కువగా ఆర్థికపరమైనవే ఉంటున్నాయని ధర్మాసనం పేర్కొంది. అహం, కీర్తి వంటి అంశాలతో భార్యాభర్తల మధ్య చిన్న చిన్న వివాదాలు తీవ్రమైన పరిణామాలకు దారితీస్తాయి.. సయోధ్య లేదా కలిసి ఉండటానికి అవకాశం లేనంతగా సంబంధాలు దెబ్బతింటాయి" అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. "భరణం నిర్ణయం వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది.. ఇందులో ఏకపక్ష ఫార్ములా ఉండకూడదు.. పరస్పర అంగీకారం ద్వారా వివాహాన్ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌లో కోర్టు చెప్పినట్టు భరణం చెల్లించడానికి అంగీకరించారు" అని పేర్కొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 21 డిసెంబర్ 2024

# నవజీవన్ బధిర బాలలకు నిత్యావసర వస్తువుల కిట్ల పంపిణీ.




ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:
నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న నవజీవన్ బధిరుల పాఠశాలలో 150 మంది బాలలకు నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేయడం జరిగింది. నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ జి. రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ కల్పన, ఆర్.ఆర్.ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ రవికాంత్ రెడ్డి, సిసింద్రీ ఆసుపత్రి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ వకుళ క్రాంతి ల సౌజన్యంతో నిత్యావసర కిట్లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం, ఐఎంఏ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నంద్యాల పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రత్యేక పాఠశాలలకు సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. పాఠశాలలో ఉన్న బధిర బాలలందరికీ ఐఎంఏ హెల్త్ కార్డులను పంపిణీ చేస్తామని, తద్వారా వారు ఉచిత ఓపిడి సేవలు నంద్యాలలో పొందవచ్చని అన్నారు. ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ నర్మద, అధ్యక్షురాలు డాక్టర్ కల్పన మాట్లాడుతూ నంద్యాల ఐఎంఏ మహిళా వైద్యుల విభాగం ఆధ్వర్యంలో త్వరలో నవజీవన్ పాఠశాలకు అవసరమైన క్రీడా పరికరాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్పన, డాక్టర్ నర్మద, డాక్టర్ అనూష, డాక్టర్ మధుసూదన రెడ్డి ,డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి,నవజీవన్ పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి, సిస్టర్ శిరీష, అడ్మినిస్ట్రేటర్ రాజశేఖర్ , అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బధిర బాలలు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. వినికిడి లేకపోయినప్పటికీ, సంగీతానికి, పాటలో ఉన్న భావానికి అనుగుణంగా డాన్స్ మాస్టర్ సైగలతో ఇచ్చే సూచనలకు చక్కటి నృత్యాన్ని ప్రదర్శించారు. డాక్టర్ కల్పన, డాక్టర్ నర్మద, డాక్టర్ అనూష, డాక్టర్ మధుసూదన రెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి లను డాక్టర్ రవి కృష్ణ నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున శాలువా, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.

# విత్తన శుద్ధి కేంద్రాలను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు




ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ డిసెంబర్ 20: నంద్యాల మండలంలోని విత్తన శుద్ధి కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి వై. వి మురళీ కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి , నంద్యాల వారు భవ్య సీడ్స్ మరియు బబ్బురి ఆగ్రో ఇండస్ట్రీస్ నందు పలు రిజిస్టర్ లు మరియు పత్రాలు, కంపెనీల స్టాక్ లను పరిశీలించడం జరిగింది.తర్వాత జిల్లా వ్యవసాయ అధికారి నంద్యాల వారు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన కంపెనీల ప్రత్తి విత్తనాలు మాత్రమే ప్రాసెసింగ్ చెయ్యాలని కంపెనీల నుండి వచ్చిన ప్రత్తి విత్తనాలు మరియు తిరిగి కంపెనీకి పంపే ప్రత్తి విత్తనాల నిల్వలను కంపెనీ వారిగా రిజిస్టర్ నిర్వహించాలని,ప్రత్తి విత్తన శుద్ధి కేంద్రాల యజమానులు అందరూ ప్రత్తి ప్రాసెసింగ్ చేసిన తర్వాత వచ్చే వ్యర్థ లను ఈటీపీ ప్లాంట్ ద్వారా శుద్ధి చెయ్యాలని తెలియచేశారు,శుద్ధి చేసాకా వెలువడిన నీటిని పంట పొలాలకి వదలారాదని, వదిలిన యెడల విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకొనబడును,ప్రతీ నెలా శుద్ధి చేసిన విత్తన స్టాక్ నిలువల రిపోర్ట్ ని కంపెనీల వారీగా మండల వ్యవసాయ అధికారి ,నంద్యాల వారి ద్వారా జిల్లా వ్యవసాయ అధికారి నంద్యాల వారికి అందచేయాలని సూచించడం జరిగింది. అదేవిధంగా విత్తన చట్టం 1966 కి అనుగుణంగా విత్తన శుద్ధి కేంద్రాల యజమానులు వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

# పి.ఆర్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన ఎన్ఎండి ఫయాజ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:
నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ గ్రౌండ్ ఆవరణంలో ఏర్పాటుచేసిన పిఆర్ ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ప్రభాకర్ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొని నూతన హంగులతో , మరి ఎన్నో వెరైటీ లతో ఏర్పాటుచేసిన పి ఆర్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ఎస్పిజి గ్రౌండ్ ఆవరణంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉందని . భారీ బహుబలి సెట్టింగ్ తో హైదరాబాద్ కి వెళ్లవలసిన అవసరం లేకుండా నంద్యాల లోనే ఏర్పాటు చేయడం జరిగిందని చిన్నపిల్లలు పెద్దలు అందరూ ఆహ్లాదకరంగా ఆడుకునే వస్తువులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని . ఈ అవకాశాన్ని నంద్యాల పట్టణ ప్రజలు మరియు చుట్టుపక్కల ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవనగర్ ప్రభాకర్ , కొండా రెడ్డి , ఉప్పరి సురేష్ , జోసఫ్ , ఎబినేజర్ , దీపక్ రెడ్డి, సుబ్బు, నవీన్ , గోవింద నాయుడు, బుగ్గ రాముడు , పృధ్విరాజ్ యాదవ్, గుల్లి, కాజా, వేణు, కరీం, గని, గుప్తా, రాజా తదితరులు పాల్గొన్నారు.

# దేహదారుఢ్య పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించిన ఆత్మకూరు పోలీసులు.




ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు డిసెంబర్ 20:
ఆత్మకూరు సబ్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో పోలీస్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించి దేహదారుఢ్య పరీక్షలకు ఎంపికైన అభ్యర్థులకు జిల్లా పోలీస్ అధికారుల సూచనలతో ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ మరియు ఆత్మకూరు టౌన్ ఇన్స్పెక్టర్ రాము ఆధ్వర్యంలో ఈ దినము ఆత్మకూరు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ నందు ఉచితంగా ఫిజికల్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డి.ఎస్.పి హాజరై కార్యక్రమాన్ని ప్రారంబించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేహదారుఢ్య పరీక్షలకు ఆత్మకూరు గవర్నమెంట్ కళాశాల మైదానం నందు ఉన్నటువంటి మొక్కలను డోజర్ సహాయంతో క్లీన్ చేయించి, రోడ్ రోలర్ తో 100 మీటర్స్ లైన్స్ ,లాంగ్ జంప్, 1600 మీటర్స్ గ్రౌండ్ నందు గుంతలు లేకుండా చదును చేసి శుభ్రపరచడం జరిగింది. అనంతరం ఫిజికల్ టెస్ట్ కు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. నేడు 31 మంది మగవారు 6 మంది ఆడవారు మొత్తం 41 మంది అభ్యర్థులు హాజరవ్వడం జరిగింది. పై ఫిజికల్ ట్రైనింగ్ శిక్షణ ఇచ్చుటకు దేవానంద్ మరియు శంకర్ అనే ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ ఉచిత శిక్షణ తరగతులను గ్రామీణ/పట్టణ ప్రాంతాలలో ఉండే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పోలీసు అదికారులు తెలియజేయడమైనది.

# గ్రాండ్ సెమి క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న

## టిడిపి రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్




ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:నంద్యాల పట్టణ శివారులోని వై.ఎస్. ఆర్ నగర్ బుడగజంగాల కాలనీ నందు 19 తేదీ గురువారం నాడు సర్వకృపానిధి మినిస్ట్రీస్ వారు నిర్వహించిన గ్రాండ్ సెమి క్రిస్మస్ వేడుకలలో టిడిపి రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు . అనంతరం ఆయన చేతుల మీదుగా క్యాండిల్స్ వెలిగించి క్యాండిల్ సర్వీసును ప్రారంభించారు. అలాగే కేక్ కట్ చేసి చేరి వచ్చిన అందరికి ముందుగా క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు, గోవిందు నాయుడు, అలీ, పాస్టర్ ఇమ్మనుయేలు, పాస్టర్ సురేష్ కుమార్, సుమల జేమ్స్, పాస్టర్ పాల్ జోసెఫ్, పాస్టర్ సమూయేలు తదితర పోస్టర్లు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించండి

### -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 20:
గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే డెలివరీ అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనితీరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో గర్భిణీ స్త్రీలను వెనక్కి పంపకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పిహెచ్సి, సిహెచ్సి లలో వైద్య సేవలు మెరుగుపడాలని కలెక్టర్ ఆదేశించారు. ఓపి సంఖ్య పెరగడంతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. మాతృ శిశు మరణాలు సున్నా స్థాయికి చేరుకునేలా వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలలో పౌష్టికాహారాన్ని పెంచడంతోపాటు రక్తహీనతను అధిగమిచ్చేందుకు స్త్రీ శిశు సంక్షేమ అధికారులను సమన్వయ పరచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో ఎన్టీఆర్ వైద్య సేవలు మెరుగుపడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గుండె సంబంధిత చికిత్సలు, ఇంజక్షన్లు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాలం చెల్లిన మందులు, ఇతర వృధా పరికరాలను టెండర్లు పిలిచి వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో వెంకటరమణ, డిసీహెచ్ఎస్ ఝాన్సీ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్డెంట్ తదితరులు పాల్గొన్నారు.

# 700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

## మరియు 10 లీటర్లు నాటు సారాయి స్వాధీనం




ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 20: నంద్యాల జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సజ్ అధికారి రవి కుమార్ వారి ఆదేశాల మేరకు నంద్యాల ఎక్సజ్ స్టేషన్ పరిధిలో ఎక్సజ్ ఇన్స్పెక్టర్ వారి సిబ్బంది తో కలిసి శుక్రవారం నాడు పాణ్యం మండలం సుగాలి మెట్ట గ్రామ శివారు కొండ ప్రాంతం లో నాటు సారాయి తయారీకి సిద్ధం గా ఉన్న 700 లీటర్ల బెల్లం ఊట ను ధ్వంసం చేసి కేసు నమోదు చేయడం జరిగింది.ఆ తరువాత ఆకస్మికంగా దాడులు చేసి గడివేముల మండలం తిరుపాడు గ్రామం లో అక్రమంగా నాటు సారాయి అమ్ముతున్న ఒక వ్యక్తి ని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 10 లీటర్ల సారాయి స్వాధీనం చేసుకొని అతని ని రిమాండ్ కి పంపడం జరిగింది.అక్రమంగా నాటు సారాయి తయారు చేసిన, అమ్మినా కఠిన చర్యలు తీస్కుంటాము అని హెచ్చరించారు...దాడులలో ఎస్సై లు బ్రహ్మయ్య, శ్రీనివాసులు, సిబ్బంది రమణ, ప్రకాష్ రావు, విజయుడు, సుధాకర్, ఫరూక్ మరియు గోపాల్ సింగ్ పాల్గొన్నారు.నాటు సారాయి కి సంబందించిన ఏమైనా సమాచారం ఉంటే 8008828467,9440902586 ఫోన్ నంబర్లకు తెలుపగలరు. జి. కృష్ణ మూర్తి, స్టేషన్ హౌస్ ఆఫీసర్, పి & ఈ స్టేషన్, నంద్యాల.

# అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా.




ఆంధ్ర ప్రగతి
నంద్యాల డిసెంబర్ 20:

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ను కించపరుస్తూ కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలో బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు, శివ బాలకృష్ణ, శివయ్య లు మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలని దురుద్దేశంతో మోడీ అమిత్ షా నేతృత్వంలో మతవాదాన్ని నెత్తికెత్తుకుని బిజెపి పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే అమిత్షానో పార్లమెంట్ నుండి బర్తడే చేసి దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు .అలాగే ప్రజా సంఘాల నాయకులు పెద్ద మునయ్య మాట్లాడుతూ రాజ్యాంగ రూపకల్పన చేసిన నిర్మాత దళిత ముద్దుబిడ్డ అయినా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించడమే అన్నారు అమీషాన్ వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాల సంజీవులు, సిపిఐ సభ్యులు సుబ్రహ్మణ్యం ,పైలట్ మాబు ప్రజా సంఘాల నాయకులు ఎర్రన్న ,రామకృష్ణ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి

**-అమిత్ షా వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏఐకేఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు**

**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు డిసెంబర్ 20:**
అమిత్ షా ఫోటోలను దగ్ధం చేస్తూ నందికొట్కూరు కొత్త బస్టాండ్ నరసింహారెడ్డి సర్కిల్లో నిరసన తెలియజేయడం జరిగింది. అనంతరం పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వాఖ్యలపై సీపీఐ(యం.యల్) లిబరేషన్ పార్టీ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించడంతోపాటు ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఏఐకేఎం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. లిబరేషన్ పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా.బీఆర్.అంబేద్కర్ పీడిత వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని ఆయనను కించపరుస్తూ అమిత్ షా మాట్లాడటం



సరికాదన్నారు. బీజేపీ తొలి నుంచి పైకి అంబేద్కర్కు నివాళులర్పిస్తూ లోపల ఆయన రాసిన రాజ్యాంగాన్ని లేకుండా చేయాలనే చూస్తోందని తెలిపారు. రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని తీసుకురావాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొడతామని హెచ్చరించారు. తక్షణమే అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని, దీంతో పాటు అమిత్ షా దేశ ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాల్లో ఎస్ బి వి వి లక్ష్మీదేవి నాయకులు షేక్షావలి సోమన్న మస్తాన్వలి కేశాలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్ డే నిర్వహణ

-సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత.
-నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా .



ఆంధ్రప్రదేశ్ నంద్యాల డిసెంబర్ 20:
పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం నాడు నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న 09 మంది పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీ గారికి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ గారు సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియచేసినారు.

## విచారణకు హాజరైన దువ్వాడ శ్రీనివాస్

శ్రీకాకుళం డిసెంబర్20 ఆంధ్ర ప్రగతి:



వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాధురితో కలసి పోలీసుల విచారణకు హాజరయ్యారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్పై దువ్వాడ అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అతనిపై స్థానిక జనసేన నేతలు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. నవంబర్ 18 న కేసు నమోదు చేసిన టెక్కలి పోలీసులు.. దువ్వాడకు 41 ఏ నోటీసులు ఇచ్చి.. విచారణకు రావాలని పేర్కొన్నారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం మధురితో కలిసి విచారణకు వచ్చారు. కాగా ఆంధ్రప్రదేశ్లో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్సీపీ నేతలపై అనేక కేసులు నమోదు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్కు టెక్కలి పోలీసులు షాక్ ఇచ్చారు. విచారణకు హాజరుకావాలని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్కు 41ఏ నోటీసులు జారీ చేసింది. తాజాగా దువ్వాడ శ్రీనివాస్పై జనసేన కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పవన్ కళ్యాణ్పై దువ్వాడ శ్రీనివాస్ తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో స్పందించిన పోలీసులు.. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దువ్వాడ శ్రీనివాస్కు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులపై స్పందించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్.. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా తాను భయపడేది లేదన్నారు. టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారని, వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తన కారుకు కూడా నిప్పంటించారని, చంపేస్తామని బెదిరించారని వ్యాఖ్యానించారు. జనసేన కార్యకర్తల ఆగడాలపై తాను పోలీస్ స్టేషన్లో సాక్షాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంపై దువ్వాడ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం చేసిన వ్యాఖ్యలకు పోలీసులు ఇప్పుడు 41ఏ నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దువ్వాడ శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.

## ఇకపై వాట్సాప్ లో చాట్ జీపీటీ...

యాప్ను డౌన్లోడ్ చేసుకోకుండానే
వాట్సాప్ ద్వారా చాట్జీపీటీ సేవలు
రోజువారీ వాడుకపై పరిమితి



విజయవాడ,డిసెంబర్20 ఆంధ్ర ప్రగతి: ఇటీవల కాలంలో చాట్ జీపీటీ విస్తృతంగా ప్రజాదరణ పొందింది. దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మద్దతున్న ఓపెన్ ఏఐ రూపొందించిన ఈ చాట్బాట్ మరింత అందుబాటులోకి రానుంది. ఇప్పటి వరకూ దీనిని వినియోగించుకోవాలంటే యాప్ను డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంది. ఇప్పుడు వాట్సాప్లో కూడా చాట్ జీపీటీ సేవలను వినియోగించుకోవచ్చు. ఈ సేవలను ప్రపంచ వ్యాప్తంగా ఓపెన్ఏఐ అందుబాటులోకి తెచ్చింది. o18002428478 నంబర్తో వాట్సాప్లో చాట్ చేయొచ్చు. మనం అడిగిన ప్రశ్నలకు చాట్జీపీటీ సమాధానాలు ఇస్తుంది. భారత్లో కూడా దీన్ని వినియోగించుకోవచ్చు. ఇదే నంబర్కు కాల్ చేసి కూడా చాట్జీపీటీ సేవలు పొందవచ్చు. అయితే, ప్రస్తుతానికి కాల్ సదుపాయం కేవలం అమెరికా, కెనడాకు మాత్రమే పరిమితం. ప్రస్తుతం చాట్జీపీటీ సేవలు పొందాలంటే యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలి. వాట్సప్లో అయితే ప్రత్యేకంగా అకౌంట్ అవసరం లేదు. అయితే రోజువారీ వాడుకపై పరిమితి ఉంటుంది. పరిమితి దగ్గర పడిన తర్వాత నోటిఫికేషన్ ద్వారా ఆ సమాచారం అందుతుంది. భవిష్యత్తులో చాట్జీపీటీ సెర్చ్, ఇమేజ్ బెస్ట్ ఇంటరాక్షన్, కన్వర్జేషన్ మెమొరీ లాగ్స్ వంటి సదుపాయాలు కూడా రానున్నాయి. ఇప్పటికే మెటా .. వాట్సాప్లో ఏఐ చాట్బాట్ సేవలను అందిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి పోటీగా ఓపెన్ ఏఐ అనౌన్స్మెంట్లో భాగంగా గురువారం చాట్జీపీటీ వాట్సాప్ వినియోగాన్ని ప్రకటించింది.

# ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా?

డిసెంబర్20 ఆంధ్ర ప్రగతి:
ఎన్నికలనేవి ప్రజాస్వామ్యంలో పండుగ వంటివి. పండగ ఖర్చును చూసి ఎవరూ భయపడరు. ఉన్నవాడు లేని వాడు అంతా తమకు ఉన్న దాంట్లో పండగ చేసుకుంటారు. అలాంటి ప్రజాస్వామ్య పండుగకు ప్రభుత్వం చేసే ఖర్చును బూచీగా చూపించి మోడీ సర్కార్ జమిలీ ఎన్నికలను ముందుకు తెచ్చింది. నిజానికి ఖర్చు మాట పైకి చెబున్నది. లోగుట్టు వేరే. ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా అనిపిస్తుంది సామాన్యుడికి సైతం. ఎన్నికల ఖర్చు ఆదా అంటే.. అది ఎన్నికల నిర్వహణ ఖర్చు ఆదానా లేక రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చులు
తగ్గించుకునేందుకా! లోక్ సభ ఎన్నికలు ఒక సారి, అసెంబ్లీ ఎన్నికలు ఒక సారి వస్తే.. రెండు సార్లు నేతలు ఓటుకు నోటు ఇవ్వాలి, ప్రచారానికి భారీగా ఖర్చు పెట్టాలి, మందు ముక్క కు ఖర్చు పెట్టాలి.. అదే ఒకేసారి ఎన్నికలు వచ్చేస్తే ఖర్చులో ఖర్చు తగ్గిపోతుంది! అసెంబ్లీ ఎన్నికలకు, లోక్ సభ ఎన్నికలకు రెండు సార్లు నోటు ఇవ్వాల్సిన పని ఉండదు, ఇక ప్రచార ఖర్చు అయితే మరింతగా తగ్గిపోతుంది! బహుశా నేతలకు ఒకేసారి ఖర్చు చేసి ఐదేళ్ల పాటు ఇష్టానుసారం వ్యవహరించుకోవ డానికే ఈ జమిలి ఎన్నికల ఆలోచన కాబోలు! అయితే ఈ మాత్రం ఆలోచన, ఈ మాత్రం జ్ఞానం అమెరికా వంటి దేశానికి ఎందుకు లేదో మరి. అక్కడి ప్రతి నాలుగేళ్లకూ ఒకసారి ఎన్నికలు పెట్టుకున్నారు. శతాబ్దాల నుంచి అలాగే కొనసాగిస్తూ ఉన్నారు! మన దగ్గర ప్రధానికి అవకాశం ఐదేళ్లు, ముఖ్యమంత్రికి అవకాశం ఐదేళ్లు.. అన్ని ప్రజాస్వామ్య బద్ధ




పదవులకూ ఐదేళ్ల కాలాన్ని ఇచ్చింది భారతరాజ్యాంగం. అమెరికాలో మరీ నాలుగేళ్లే అవకాశం. ఐదేళ్లతో పోలిస్తే నాలుగేళ్లు ఒక ఏడాది ముందుగానే గడిచిపోతాయి. సర్దుకోవడానికి ఏడాది పడుతుంది, చివరి ఏడాది ఎన్నికల ఏడాది. మధ్యలో మిగిలింది రెండేళ్ల సమయమే.. అయితే ఏ అమెరికన్ ప్రెసిడెంట్ కూడా నాలుగేళ్లు మరీ తక్కువ కాలం, దాన్ని ఐదేళ్లు చేయాలనో, ఆరేళ్లు చేయాలనో వాదించలేదు! అలా తమ పదవీ కాలాన్ని పెంచుకునే ప్రయత్నాలనూ చేయలేదు!
ఎన్నికల ఖర్చు గురించి తెగ బాధపడిపోతూ ఇప్పుడు భారత ప్రభుత్వం ఒక దేశం ఒక ఎన్నికలు అంటూ వాదిస్తూ ఉంది. అయితే ఏదైనా 'ఒకే' అనేది భారత్కు వర్తింపచేయటం చాలా కష్టం. అసలు కుదరదు. ఎందుకంటే మనది భిన్నత్వం! భిన్నత్వంలో ఏకత్వమే భారత ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తూ వచ్చింది. అయితే మరీ ముఖ్యంగా 2014 నుంచి ఒకటే ఒకటే.. అనే మాట బాగా వినిపిస్తూ ఉంది. ఒకటే భాష, ఒకటే మతం, ఒకటే పౌరసత్వం, ఒకటే ఎన్నిక.. ఇలాంటి వాదనలు ముఖ్యమైన పదవుల్లోని వారి నుంచి వినిపిస్తూ ఉన్నాయి. ఒక్కక్కటిగా సాధించుకుంటూ ఉన్నారు! మరి ఇప్పుడు ఒకేసారి ఎన్నికలు జరిగిపోతే ఆ తర్వాత ఐదేళ్లు ఇక ఏం చేసినా అడిగే వారు ఉండరనా!
మొన్నటి వరకూ మోడీజీకి చాలా కష్టం ఉండేది. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలంటే కర్ణాటక చుట్టూ నెల రోజుల పాటు తిరగాలి, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలంటే మహారాష్ట్ర కు తనే సీఎం అభ్యర్థిని అన్నట్టుగా ప్రచారం చేయాలి.. ఇలా దేశంలో ఎక్కడ అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా.. ప్రధానిగా కన్నా.. ఆ రాష్ట్రానికి తనే సీఎం క్యాండిడేట్ అన్నట్టుగా మోడీ ప్రచారం చేసి పెట్టే వాళ్లు! మరి ఈ ఇబ్బంది వద్దనే.. ఒక దేశంలో అన్ని రాష్ట్రాలకూ, అన్ని లోక్ సభస్థానాలకూ ఎన్నికలు జరిగేస్తే? ఆ తర్వాత మోడీ కి ఇలా ముఖ్యమంత్రి అభ్యర్థి తరహాలో ప్రచారం చేయాల్సిన అవసరం తప్పుతుంది! ఇక ఆయన ఎంచక్కా ప్రధానిగా తన పనుల్లో మునిగిపోవచ్చు. అలాగే యూపీ అసెంబ్లీ ఎన్నికలంటే పెట్రో ధరలను పెంచకుండా కొన్నాళ్లు ఓపిక పట్టే వారు, ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచి పోలింగ్ ముగిసే రోజు వరకూ ధరల హెచ్చులు ఉండేవి కావు. అలాగే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలున్నప్పుడు కొన్ని ప్రజాకర్షక పథకాలు ఉండేవి. ఇక వాటి అవసరం కూడా ఉండదు. ఎలాగూ దేశమంతా ఐదేళ్లకు ఒకసారి అన్ని ఎన్నికలూ అయిపోతాయి కాబట్టి? ఇక ఆ రెన్నాళ్లూ ప్రజాకర్షక పథకాలు అమలు చేస్తే చాలు, ఆ తర్వాత ఐదేళ్లూ ఆడింది ఆట, పాడింది పాట! కార్పొరేట్లకు వంత పాడుకోవచ్చు , సామాన్య ప్రజలు మరో ఐదేళ్ల వరకు సైలెంట్గా మూలనపడి ఉంటారు.

# అంబేడ్కర్ను అవమానించిందే కాంగ్రెస్

**ఇప్పుడేమో లేని ప్రేమ ఒలకబోస్తోంది - మంత్రి సత్యకుమార్ ఘాటు విమర్శలు**

విజయవాడ,డిసెంబర్20 ఆంధ్ర ప్రగతి:
అంబేద్కర్ను అవమానించిన కాంగ్రెస్ ఇప్పుడు డ్రామాలు అడుతోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. దేశంలో కాంగ్రెస్ చేసినన్ని అరాచకాలు ఇంకెవ్వరూ చేయలేదన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజ్యాంగ బద్ధంగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రతిపక్షాలు పార్లమెంట్లో సమయాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్కు ఉన్నట్టుండి రాజ్యాంగం, అంబేద్కర్ మీద ప్రేమ పుట్టుకువచ్చిందని విమర్శించారు. శుక్రవారం విజయవాడలో మంత్రి సత్యకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో 24వ సవరణ తీసుకువచ్చి ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కులు హరించే విధంగా కాంగ్రెస్ పాలన చేసిందని అన్నారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రాజ్యాంగం రచించేటప్పుడు అంబేద్కర్ని అవమానపరిచేలా కాంగ్రెస్ పార్టీ కార్టూన్స్ని విడుదల చేశారని ÷ర్ అయ్యారు. అంబేద్కర్ని నెహ్రూ చాలా విధాలుగా అగౌరవపరిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ని ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడించారని చెప్పారు. 'అంబేద్కర్ పోటీ చేసినప్పుడు బీజేపీ అభ్యర్థిని పోటీకి దించకుండా ఆయన్ని బీజేపీ గౌరవించింది.



అంబేద్కర్ స్మారకాన్ని నిర్మించటానికి నెహ్రూ అడ్డుపడ్డారు. అంబేద్కర్ సేవలకు భారతరత్న ఇవ్వకుండా నెహ్రూకు మాత్రం ప్రకటించుకున్నారు. అంబేద్కర్ సేవలు గుర్తించి బీజేపీ భారతరత్న ఇచ్చి గౌరవించింది. అంబేద్కర్ నడయాడిన ఐదు ప్రదేశాల్లో పంచ తీర్థ్ కార్యక్రమంతో బీజేపీ శ్రీకారం చుట్టింది. ఏపీలో కూడా కొత్త పిచ్చగాళ్ళు తయారయ్యారు. పలు రాష్టాల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయ్యింది. అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ మనుగడ కోల్పోతుంది. కాంగ్రెస్ తప్పు తెలుసుకుని అసత్య ప్రచారాలు చేయటం మానుకుంటే మంచిది. జమిలి ఎన్నికలు ఈ దేశానికి కొత్త కాదు. గతంలో చూసుకుంటే దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగాయి' అని మంత్రి సత్యకుమార్ తెలిపారు. 'వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి 2027లో జమిలి ఎన్నికలు వస్తాయని అని చెప్పి పార్టీ నాయకులని కాపాడుకుంటున్నారు. పార్టీలో నుంచి ముఖ్యమైన నాయకులు బయటకు వెళ్లిపోతున్నారని వారిని కాపాడుకునేందుకు జగన్ 2027లో జమిలి వస్తాయని చెబుతున్నాడు. వైసీపీ పార్టీ ఖాళీ అవ్వకుండా కాపాడుకునేందుకు అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడు. జమిలి ఎన్నికలపై కమిటీ వేశారు. కమిటీ అభిప్రాయాల మేరకు ఎప్పుడు జరుగుతాయో తెలియచేస్తారు. పార్లమెంట్లో బలం ఉంటే బిల్లు పెట్టాలని రూల్ లేదు. జమిలి ఎన్నికల వల్ల ప్రజాధనం ఆదా అవ్వడంతో పాటు దేశ అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతుంది. రాష్టాల్లో ఏదొక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పాలన పరంగా సంక్షేమ పథకాలు అమలు చేయటంలో ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుంది' అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.దళితులను ఉద్ధరించిన విధంగా, దళితుల కోసం కాంగ్రెస్ పుట్టినట్లుగా కాంగ్రెస్ నాయకులు వ్యవహారిస్తున్నారని బీజేపీ ఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ విమర్శలు చేశారు. అంబేద్కర్ రెండు సార్లు పోటీ చేస్తే కాంగ్రెస్ ఓడించి అనేక విధాలుగా ఇబ్బందులకి గురిచేశారని మండిపడ్డారు. అంబేద్కర్ నడియాడిన ప్రాంతాల్లో బీజేపీ అంబేద్కర్ కోసం చాలా కార్యక్రమాలు చేసిందని దేవానంద్ గుర్తుచేశారు.